క్లుప్తంగా

సుందరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పడమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి వారి 16వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందరకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విశేష అర్చనలు, పూజలు, అభిషేకాలు, ఆకు పూజ, హనుమత్ కల్యాణం జరిగింది.

అభివృద్ధికి మెరుగైన ప్రణాళికలు

ఎంపీపీ దావూరి లలిత కుమారి



భట్టిప్రోలు: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మెరుగైన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మానవ వనరులు, ఆర్థిక వనరులు సద్వినియోగం చేసుకుని అన్నిశాఖల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఆయా పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, ఎ.చినవెంకటేష్ బాబులు శిక్షణ ఇచ్చారు. తొలుత మహాత్మాగాంధీ, భారతరత్న అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఊహారాణి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నైపుణ్య గణన సర్వేకు వ్యాపారులు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వేకు వ్యాపారులందరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. షరాఫ్ బజారులో బుధవారం జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తమ వివరాలు తెలియజేయటం వలన ప్రభుత్వ పథకాలు అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరిమబ్బుల కలవరం!

మాగాణి రైతుల్లో భయం.. భయం

- మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగు
- కోతకు వచ్చిన పైరు
- వర్షాలతో తాలు ఎక్కువయ్యే ప్రమాదం
- పొలాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు



భట్టిప్రోలులో కమ్ముకున్న మబ్బులు



చినపరిమిలో పొలంలోని ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన రైతులు

భట్టిప్రోలు: ఆరుగాలం కష్టపడి ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పండించిన పంట చేతికందే తరుణంలో బుధవారం ఒక్కసారిగా కురిసిన వర్షం మాగాణి రైతులను కలవర పెట్టింది. ఈ ఖరీఫ్‌లో ఇప్పటివరకు తొలుత ముప్పు వాటిల్లినా రైతులు ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నెలకొన్న వాతావరణ ప్రభావంతో మార్పు చోటు చేసుకుంది. పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెన్నాడుతున్నాయి. వర్షాలు, వాయుగుండాలు, తుఫానుల ప్రభావం అంతగా లేవనుకుంటున్న తరుణంలో క్షణాల్లో చోటు చేసుకున్న మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతాంగం పంట చేతికి వచ్చే దశలో ఉన్న వరిని వర్షం బారిన పడకుండా ఎలా కాపాడాలో అర్థం కాక ఆందోళన చెందుతోంది. ఈ సంవత్సరంలో పంటలు బాగా పండుతాయని భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుని, గింజల బరువుతో తలలు వంచిన కంకులు చూసుకుటూ, దిగుబడులు లెక్క పెట్టుకుంటున్న రైతులు ఆకాశంలో కమ్ముకున్న మబ్బులను చూసి ఆందోళన చెందుతున్నారు.



భట్టిప్రోలు-తెనాలి రహదారిలో పక్వానికి వచ్చిన వరి పైరు

అకాల వర్షంతో నేలవాలిన వరి

కొల్లూరు: అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిచిన చిన్నపాటి వర్షానికే వరి పంట నేలవాలడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. వరి పంట కోతకు వచ్చిన దశలో వాతావరణంలో వర్షాలు కురవడం కారణంగా పంట నష్టం తప్పదన్న ఆవేదన రైతాంగంలో వ్యక్తమవుతుంది. వర్షం కారణంగా మండలంలో సుమారు వంద ఎకరాలకు పైగా పంట నేలవాలడంతో దిగుబడి తగ్గుతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతుంది. కోతకు వచ్చిన వరి పంట నేలవాలడం కారణంగా వడ్లు నేలరాలిపోవడంతోపాటు, లేత దశలో ఉన్న గింజ ఎదుగుదల కోల్పోయి తాలు గింజలుగా మిగిలిపోయే ముప్పు ఉందన్న ఆందోళన రైతాంగంలో వ్యక్తమవుతుంది.



క్రాప వద్ద నేలవాలిన వరి పైరు

దిగుబడులపై ఆందోళన

వర్షాల వల్ల తాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. వర్షాల కారణంగా పైరుకు మానుగాయ ప్రమాదం ఉందని, నేలవారిన పైరు కారణంగా దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ఈ కారు మబ్బులు ఇంతటితో పోతే బాగుంటుందని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు. భట్టిప్రోలు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఐతే ముదురు పైర్లు చేతికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో కొద్ది రోజుల్లో లేత పైర్లు పక్వానికి రానున్నాయి.

ధాన్యం కాపాడుకునేందుకు...

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో బుధవారం వరికోతలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం వర్షం పడటంతో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు అనేక అవస్థలు పడ్డారు. కొంతమంది రైతులు పొలాల్లో ధాన్యం తడవకుండా పట్టలు కప్పారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి...

సాధ్యమైనత మేర వర్షపు నీరు పంట పొలంలో నిల్వ ఉండకుండా బయటకు పోయేలా చూసుకోవాలి. రైతులు తగు సూచనలు పాటిస్తే ఉపద్రవాన్ని అధిగమించవచ్చునన్నారు. ఈ ఏడాది వెద, వరి నాట్ల విధానం ద్వారా రైతులు పంటలను వేశారు.

– గొల్లపోతు మీరయ్య, వ్యవసాయ శాఖాధికారి, భట్టిప్రోలు

ధర్మ రక్ష దినోత్సవాలు

భట్టిప్రోలు: సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ధర్మ రక్ష దినోత్సవాలలో భాగంగా బుధవారం భట్టిప్రోలు మండలం ఐలవరం వేణుగోపాల స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు, ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు వి.కోటేశ్వరరావు, ఆర్. సత్యమోహనరావు, అర్చకులు శేషు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

మండల సమాఖ్య సిబ్బందిపై వెలుగు పీడీ ఆగ్రహం



అమర్తలూరు(వేమూరు): రికవరీల్లో వెనుకబడిన మండల సమాఖ్య సిబ్బందిపై జిల్లా వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమర్తలూరు మండల కేంద్రంలో వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయం మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. వెలుగు ప్రాజెక్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మండల సమాఖ్య రికవరీల్లో చాలా వెనుకబడి ఉందన్నారు. వసూళ్లు ఎందుకు చేయడం లేదని ఆమె సిబ్బందిని ప్రశ్నించారు. జెండర్ యాక్టివిటీస్, మండలంలో జరిగే కార్యక్రమాల గురించి వెరిఫికేషన్ చేశారు. సిబ్బంది బాధ్యతగా పని చేయాలని సూచించారు. పనిచేయని సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీపీఎం ఫైనాన్స్ కాకి రవి, బూదటి శ్రీనివాసరావు, మండల ఏపీఎం రాంబాబు, సీసీలు శోభారాణి, నాంచారయ్య, బి.ఆంజనేయులు, బలరామకృష్ణ, నరసమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు సత్వరమే నిర్మించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్



చుండూరుపల్లిలో ఇళ్లులేని పేదల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేబీ శ్రీధర్

బాపట్లటౌన్: పేదలకు పక్కాగృహాలను సత్వరమే నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ తెలిపారు. మండలంలోని చండూరుపల్లి గ్రామంలో గత 20 సంవత్సరాలుగా నివసిస్తున్న యానాదుల కాలనీలో ప్రభుత్వాలు ఎటువంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదన్నారు. బుధవారం గిరిజన కాలనీల్లో పర్యటించి పేదల నుంచి అర్జీలను స్వీకరించారు. జేబీ శ్రీధర్ మాట్లాడుతూ నిరుపేదలైన పేదలు కాయకష్టం చేసుకొని నిర్మించుకున్న పూరి గుడిసెల్లోనే ఏళ్ల తరబడి కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వారి పిల్లలు పెళ్లిళ్లైనా అదే ఇంట్లో నివాసం ఉంటున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్రామంలోని నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమం ఈనెల 18వరకు కొనసాగుతుందన్నారు. పేదల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయా సచివాలయాల వద్ద పేదలకోసం ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సీపీఐ బాపట్ల నియోజకవర్గ కార్యదర్శి బక్క వెంకట రామకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏట్రా శ్రీనివాసులు, ముత్యాలు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై వెబినార్

రేపల్లె రూరల్: శాస్త్ర సాంకేతిక రంగంలో వచ్చిన వినూత్న మార్పులను బోధనా రంగంలో అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవిచంద్రకుమార్ చెప్పారు. స్థానిక కళాశాలలో బుధవారం నిర్వహించిన ఆంగ్ల భాష జాతీయ స్థాయి వెబినార్‌ను ఆయన ప్రారంభించారు. తర్వాత మాట్లాడారు. ఆంగ్ల భాషపై తర్ఫీదు పొంది విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధించాలన్నారు. ఈ వెబినార్‌లో తెలుగు రాష్ట్రాలలోని పలు కళాశాలల ప్రొఫెసర్‌లు ప్రసంగించారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి



బాపట్ల: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ బాబురావు పేర్కొన్నారు. బుధవారం బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యానిమేటర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ బాబురావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులతోపాటు అందుబాటులో ఉండే వనరులతో ప్రజల అవసరాలను ప్రాధాన్యతా క్రమంలో తీర్చేందుకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాలు, అందరికీ విద్య, వైద్య సౌకర్యాలు కల్పన, సురక్షిత మైన మంచి నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలకి , గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వేయాలని సూచించారు. ఈటీసీ ఫ్యాకల్టీ మెంబర్ కె.శ్రీనివాస్, పరిపాలన అధికారి కె.లావణ్య, రిసోర్స్ పర్సన్ జున్ను మరియమ్మ, గుమ్మడి స్టాలిన్, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బాపట్లటౌన్: ఆన్‌లైన్‌లో పరిచయమైన యువకుడిని నమ్మి అత్యాశకు పోయిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పిట్టలవానిపాలెం మండలంలో చోటుచేసుకుంది. పిట్టలవానిపాలెం మండలం, నదిముల్లాయపాలెం గ్రామానికి చెందిన మహిళ తనకు టెలిగ్రామ్‌లో పరిచయం అయిన యువకుడితో కొంతకాలంగా ఫోన్‌లో మాట్లాడుతుంది. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని చెప్పడంతో ఆశపడిన మహిళ గ్రామంలోని వేరే వ్యక్తి దగ్గర రూ. 5 లక్షలు అప్పుగా తీసుకొని ఫోన్‌లో పరిచయమైన వ్యక్తి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది. తర్వాత సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో ఏం చేయాలో తెలియక బుధవారం గ్రామంలో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న చందోలు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మోసానికి పాల్పడిన వ్యక్తి వివరాలు రాబట్టి మోసపోయిన నగదు తిరిగి తెప్పించే ప్రయత్నం చేస్తామన్నారు.

ఎడ్ల బళ్ల కార్మికులను ఇసుక తోలుకోనివ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: ప్రభుత్వ నిబంధనల ద్వారా ఇసుక తోలుకుంటున్న ఎడ్ల బళ్ల ముఠా కార్మికులపై అధికారులు కక్షసాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. ఎడ్ల బళ్ల ద్వారా ఇసుక తోలుకోకుండా అధికారులు నిరోధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎడ్లబళ్ల ముఠా కార్మికులు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలో, డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆయాశాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు కోసం స్పష్టంగా జీఓలో ఎడ్ల బళ్ల ద్వారా ఇసుక తీసుకెళ్లేవారిని అడ్డుకోవద్దని చెబుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు నుంచి రేపల్లెకు చెందిన ఎడ్ల బళ్ల ముఠా కార్మికులు తమ బళ్ల ద్వారా తీసుకువస్తున్న ఇసుకను బలవంతంగా మార్గమధ్యలో భట్టిప్రోలు పోలీసు, రెవెన్యూ అధికారులు పడవేయిస్తున్నారన్నారు. దీంతో టైరు బళ్ల ద్వారా ఉపాధి పొందుతున్న ఇసుక ముఠా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ ఎడ్లబళ్ల ఇసుక ముఠా వర్కర్ యూనియన్ నాయకులు జి.రాఘవయ్య, పి.వినోద్, ఎస్.గణేష్, టి.రామయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జె.ధర్మరాజు, కె.ఆశీర్వాదం, బి.ఆగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



మొక్కలు నాటుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు

రేపల్లె రూరల్: మొక్కల నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దటంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ రోడ్డు, పలు ఖాళీస్థలాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రహదారులపై, ఖాళీస్థలాలలో పట్టణవాసులు చెత్త పడవేయకుండా ఇంటింటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ రేపల్లెను సాధించగలమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజుకు ఒక మొక్కను నాటి దాన్ని పెంచే బాధ్యతను తీసుకుని పర్యావరణ హితులుగా మారాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ మాట్లాడుతూ పట్టణంలోని రైల్వేస్టేషన్, ఇండియన్ బ్యాంక్ రోడ్డులలో చెత్తను ఎంత శుభ్రం చేస్తున్నా స్థానికులు రహదారి పక్కనే పడవేస్తుండటంతో ఆ ప్రాంతం దుర్గంధ భరితంగా మారుతోందన్నారు. నిత్యం వందల మంది రాకపోకలు సాగించే ఆయా రహదారులు శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా రహదారులలో చెత్తకుండీలను తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటామన్నారు. ఆ ప్రాంతవాసులు మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకుని సంరక్షించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు ప్రశాంత్‌కుమార్, కాశీ విశ్వనాథగుప్త, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ కోడే గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లైబ్రేరియన్ శివాజీ గణేషన్

బాపట్ల: గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వతేదీ నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు బాపట్ల శాఖ లైబ్రేరియన్ ఏ.శివాజీగణేషన్ పేర్కొన్నారు. ఈమేరకు గ్రంథాలయంలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రంథాలయం వారోత్సవంలో పుస్తక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పోస్టర్ల ఆవిష్కరణలో డాక్టర్ పి.సి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చీరాలలో చోటుచేసుకుంది. విజయనగర్ కాలనీకి చెందిన తేళ్ల మార్క్ (48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగా ఇంటి నుంచి వెళుతుండగా రైలు పట్టాలుదాటే క్రమంలో ప్రమాదవశాత్తు విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్లే రైలు ఢీకొట్టింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య విజయలక్ష్మి, నవ్యశ్ర, మహేష్ అనే ఇద్దరు పిల్లలున్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



జమ్ములపాలెం విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ ఎస్.పురుషోత్తం

బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న యాజలి శరత్ బాబు ఈనెల 3,4,5 తేదీల్లో నెల్లూరు జిల్లా, సౌత్ మొరపాడు గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ అండర్-17 పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచి హర్యానాలో ఈనెల 19 నుంచి 26 తేదీ వరకు జరిగే జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక అయ్యాడన్నారు. అదేవిధంగా అండర్-14 విభాగంలో ఈనెల 8, 9, 10 తేదీల్లో అనకాపల్లి జిల్లా, నక్కపల్లి లో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జమ్ములపాలెం హైస్కూల్ నుంచి 7వ తరగతి విద్యార్థి వేముల విక్టర్‌పాల్ ఉత్తమ ప్రతిభ కనపరిచి మధ్యప్రదేశ్‌లో డిసెంబర్ 7నుంచి 12వరకు జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం డీఈఓ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బోయిన వీరచంద్ర పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

తెనాలి: వంటగ్యాస్ వినియోగంపై దేశవ్యాప్తంగా లక్షమంది వినియోగదారులకు మరీ ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంగా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో అవగాహన సదస్సును నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ ఇండేన్ గ్యాస్ ఎంటర్‌ప్రైజెస్ వారు ఏర్పాటు చేసిన సదస్సులో పంపిణీదారు ఎంవీ మురళీకృష్ణ గ్యాస్ వినియోగంపై తగిన సూచనలు చేశారు. ఐఓసీ కంపెనీ రూపొందించిన డిజిటల్ వీడియోను ప్రదర్శించి, గ్యాస్ వినియోగంలో మెలకువలను తెలియజేశారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించారు. ఏఎస్ఆర్ కాలేజీ, గుడివాడ విశ్రాంత ప్రిన్సిపాల్ పావులూరి శ్రీనివాసరావు మాట్లాడారు. పంపిణీదారు సిబ్బంది మాధవీలత, శ్రీను, జయరావు, ప్రదీప్, మెకానిక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయుడు బాషా సహకరించారు.

సైనేడ్ హత్యల నిందితురాలికి దేహశుద్ధి

తెనాలిరూరల్: వరుస సైనేడ్ హత్యల నిందితురాలికి ప్రజలు దేహశుద్ధి చేశారు. పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీకి చెందిన తల్లీ కూతుర్లు రమణమ్మ, వెంకటేశ్వరి మరో మహిళతో కలిసి చేసిన సైనేడ్ హత్యలు తీవ్ర సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. పలువురి వద్ద అప్పులు తీసుకోవడం, తిరిగి చెల్లించే క్రమంలో వారిని నమ్మకంగా తీసుకు వెళ్లి సైనేడ్‌తో చంపేసిన పలు కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. సెప్టెంబరులో అరెస్టై జైలుకు వెళ్లిన వీరు సుమారు రెండు నెలల తర్వాత బెయిల్ పై విడుదలై బయటకు వచ్చారు. నిందితుల్లో ఒకరైన వెంకటేశ్వరి మంగళవారం యడ్లలింగయ్య కాలనీలో ఉన్న తన ఇంటికి వెళ్లడంతో స్థానికులు ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరి జైలు నుంచి రావడంతో యడ్లలింగయ్య కాలనీకి చెందిన పలువురు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వరుస హత్యలకు పాల్పడిన వారు తమ ఇళ్ల మధ్య ఉండటానికి వీల్లేదని, తల్లి కూతుర్ని ఇక్కడి నుంచి పంపించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాను పిల్లలతో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో కొందరు వచ్చి దాడి చేశారంటూ వెంకటేశ్వరి తెలిపింది. తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వివరాలు తెలియజేసింది. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు స్థానికులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.